క్లుప్తంగా

ఎస్పీని కలసిన విప్ దంపతులు



ఎస్పీ అన్బురాజన్‌ను సన్మానిస్తున్న విప్ దంపతులు

రాయదుర్గం: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేకేఎన్ అన్బురాజన్‌ను ఆదివారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, మిఠాయిలు అందజేసి పూలు, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయదుర్గం రూరల్ పీఎస్ ఏర్పాటు తో పాటు అర్బన్, ఐదు మండలాల్లోనూ సిబ్బంది కొరత పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. అనంతరం కాపు దంపతులను ఎస్పీ సన్మానించారు.

ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీ అన్బురాజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: జిల్లా నూతన ఎస్పీ అన్బురాజన్‌ను కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్‌లోని స్టేషన్ల వివరాలు, కేసుల పురోగతి, శాంతి భద్రతలపై ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపు వాహనాన్ని నడుపుతున్న విప్ కాపు

రాయదుర్గంటౌన్: విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రాయదుర్గం విశ్వ బ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం, కాళికాంబ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో కంసలవీధిలోని కాళికాంబదేవి ఆలయంలో ఉత్సవాలు చేపట్టారు. విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై వినాయ సర్కిల్ నుంచి ఆలయం దాకా వాహనాన్ని నడిపారు. ఆలయంలో కాళికాంబ ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు ఆయనకు విశ్వకర్మ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సమాజ సంఘం ప్రతినిధులు శ్రీదేవి జ్యువెలర్స్ కంసలి నాగరాజు, ఓంకారాచారి, తిప్పేస్వామి, మహిళా జేఏసీ సంధ్యారాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'వాచర్లను నియమించాలి'

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్‌లోనే అతి పెద్ద అటవీ ప్రాంతంగా విస్తరించిన జంబుగుంపలకు ప్రటెక్షన్ వాచర్లను నియమించాలని ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి తదితరులు అటవీశాఖ అధికారి పరమేశ్వరప్పకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. 7వేల ఎకరాల్లో ఉన్న అటవీప్రాంతానికి ఒక్క బీట్ ఆఫీసర్ మాత్రమే పనిచేస్తుండడంతో అడవులను పూర్తి స్థాయిలో పరిరక్షించలేక పోతున్నారన్నారు. బీట్ ఆఫీసర్‌కు తోడు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్‌తో పాటు అదనంగా ప్రొటెక్షన్ వాచర్లను నిచమించి అడవుల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని వారు కోరారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు

కుందుర్పి: ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, యువతులకు 60 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏడాది కాలంగా మండలంలోని అన్ని గ్రామాల్లో విలువల బడులు, ఉచిత డ్రైవింగ్ శిక్షణ, ఉచిత కుట్టు శిక్షణ, మొక్కల పెంపకం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టామని ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు తెలిపారు. సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచులు మారుతేశ్వరి, అతావుల్లా, ట్రస్ట్ సిబ్బంది, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

విఘ్న నాయకా.. నమోనమః

- నేడు కొలువుదీరనున్న గణనాథులు
- కిటకిటలాడిన మార్కెట్లు





రాయదుర్గంటౌన్: విక్రయానికి ఉంచిన చిన్న గణపయ్యలు , ఉరవకొండ: ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి, సీఐ

రాయదుర్గం/టౌన్: వినాయకచవితి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. దేవాది దేవుడైన బొజ్జ గణపయ్య విగ్రహాలను కొలువు దీర్చేందుకు పల్లె, పట్టణాల్లోని వీధివీధినా మండపాలు నెలకొల్పారు. వినాయక విగ్రహ ప్రతిమలు ప్రతిష్టించేందుకు పట్టణంలోని కొనుగోలు కేంద్రాలకు నిర్వాహకులు వస్తుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని దాదాపు 40 చోట్ల మండపాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు సీఐ లక్ష్మణ్ తెలిపారు. ఇంట్లో పూజల కోసం బొజ్జ గణపయ్య విగ్రహాలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయదారులు సిద్ధంగా ఉంచడంతో కొనుగోలు దారులతో రద్దీ నెలకొంది. పట్టణంలోని వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ ఏరియాల్లో జనం పండుగ సామాగ్రి కొనుగోలుతో కిటకిటలాడింది.

తొలిసారిగా కొలువుదీరనున్న హిందూ మహా గణపతి విగ్రహం

పట్టణంలోతొలిసారిగా హిందూ మహాగణపతి విగ్రహం కొలువుదీరనుంది. కర్ణాటకలోని చిత్రదుర్గం, దావణగెర, హుబ్లీ, శివమొగ్గ లాంటి ప్రాంతాల్లో జరిగే హిందూ మహాగణపతి ఉత్సవాల మాదిరిగా నిర్వహించాలని తలపెట్టిన మహాయజ్ఞంలో భాగంగా రాయదుర్గం వినాయక ఉత్సవ సమితిని ఏర్పాటు చేసి భారీ వ్యయంతో హిందూ మహాగణపతి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఇప్పటికే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 12 అడుగుల భారీ గణేష్ మట్టి విగ్రహాన్ని బళ్లారి నుంచి తెప్పించారు. సోమవారం మహాగణపతి విగ్రహం కొలువుదీరనున్నట్లు కమిటీ సభ్యులు రాజేష్, ప్రతాప్ తదితరులు తెలిపారు.

మట్టి విగ్రహాలే మహా వినాయకులు

ఉరవకొండ: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని, మట్టి విగ్రహాలే మహా వినాయకులని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి, అర్బన్ సీఐ హరినాథ్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, నిస్వార్థ సంస్థ ప్రతినిధి వెంకట్ సూచించారు. ఆదివారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిస్వార్థ, జైకిసాన్, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వందలాది మంది మట్టి వినాయక విగ్రహాలను తీసుకెళ్లారు.

ముస్తాబైన ఆలయాలు

బెళుగుప్ప: చవితి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి వినాయక దేవాలయాలు ముస్తాబయ్యాయి. అలాగే వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక మందిరాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం గ్రామ గ్రామాన చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు కొలువుదీరనున్నాయి. బెళుగుప్పలోని వినాయకనగర్‌లోని విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని ప్రత్యేక రంగులు వేసి విద్యుద్దీపకాంతులతో ముస్తాబు చేశారు. ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రశాంతంగా వేడుకలు నిర్వహించాలని అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ రామకృష్ణయ్య హెచ్చరించారు.



బెళుగుప్ప: ముస్తాబైన విఘ్నేశ్వరస్వామి ఆలయం



రాయదుర్గంటౌన్: కొలువుదీరనున్న హిందూ మహాగణపతి విగ్రహం

వినాయక చవితి శుభాకాంక్షలు







రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ | విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే | శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

రాయదుర్గం/ఉరవకొండ: వినాయక పండుగ సందర్భంగా ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వురుగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినాయకుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని వారు ఆకాంక్షించారు. గణనాథుని కరుణాకటాక్షాలతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని అభిలాషించారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్: వినాయక విగ్రహ ఏర్పాటులో కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విగ్రహాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా , అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ తేజోమూర్తి ఎస్‌ఐ ఆశా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ సమైక్య సమితి నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ సమైక్య సమితి నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు విరుప శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. తాలూకా ఇన్‌చార్జ్‌గా ఆనంద్, మండల కన్వీనర్‌గా వన్నూరుస్వామి, అధికార ప్రతినిధిగా ఆదిమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈశ్వర్, మరో పదిమంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



కణేకల్లు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గంటౌన్: మారెమ్మగుడి వద్ద నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు

కణేకల్లు: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంర్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, కె.అశోక్‌తో కలిసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు ఏనాడూ ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు బోగస్ కంపెనీ పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టాడన్నారు. అక్రమాలు, అవినీతి కార్యకలాపాలు ఒకొక్కటి వెలుగు చూస్తున్నాయని, ఆయన జీవితమంతా జైల్లోనే పడాల్సిందేనన్నారు. చంద్రబాబు స్కామ్‌లు, కుంభకోణాలు చేసి రూ.కోట్లు కొల్లగొడితే కాలవ శ్రీనివాసులు ఇసుక దందాలో రూ.500 కోట్లు దోచేశాడన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే జగనన్నను మరోమారు సీఎం చేయాలన్నారు. మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాలుపంచుకుని విజయవంతం చేసిన అధికార యంత్రాంగం, వలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ సుజాత, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, యర్రగుంట వైస్ సర్పంచు సునీతమ్మ, ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచు భీమప్ప, నాయకులు పాటిల్ రామచంద్రారెడ్డి, కేజీ ఈరన్న, గొల్ల భీమిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు ప్రారంభం

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ బాటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తూ ప్రజల్లో విశ్వాసం పొందినట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు దశలవారిగా రాయదుర్గం పురపాకలసంఘంలో అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఆదివారం పట్టణంలోని 21వ వార్డు మారమ్మగుడి ఏరియాలో రూ.2.50 లక్షల సాధారణ నిధులతో ఏర్పాటు చేసిన కొత్తబోరు, సిస్టన్ ట్యాంకును మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్ డిష్ గోవిందుతో కలసి విప్ ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేస్తామన్నారు. రూ.20 కోట్లతో డీపీఆర్ పంపించామని, మంజూరయితే రాయదుర్గం పట్టణ రూపురేఖలు మార్చేలా పనులు చేపడతాన్నారు. గత టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు అవినీతికి పెద్దపీట వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు మరోసారి ఘోర పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీలక్ష్మి, ఫకృద్దీన్, పెద్ద వన్నూరుస్వామి, మంజునాథ, దేవరాజు, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, అరవా శివప్ప, వైజాగ్ రవి, రిబ్కా, కోఆప్షన్ సభ్యుడు నజీర్, కొలిమి ఆనంద్, పవన్‌కుమార్, మల్లికార్జున, పైతోట రఘు, ఓబ, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధానాన్ని అడ్డంగా దోచిన దొంగ కోసం కొవ్వొత్తుల ర్యాలీ సిగ్గుచేటు

ప్రజాధనాన్ని అడ్డంగా దోచిన అవినీతిపరుడు, గజదొంగ చంద్రబాబు కోసం కొవ్వొత్తులు, కాగడాల ర్యాలీ చేయడం టీడీపీ నాయకులకు సిగ్గుగా లేదా అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న సమయంలో వారి ఆత్మకు శాంతి కలగాలని ఇలా కొవ్వొత్తులతో ర్యాలీ చేశారా? అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీధి నాటకాలతో ప్రజలను మోసం చేసేలా రాయదుర్గంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కాగడాల ర్యాలీ నిర్వహించడం దారుణమన్నారు. రూ.371 కోట్ల ప్రజాధాన్ని మింగేసిన దొంగ చంద్రబాబును న్యాయస్థానం జైలుకు పంపితే కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు మానవత్వం లేని రాక్షసులన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నాయకులను ప్రజలు తరమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయ వార్షికోత్సవం రేపు



ముస్తాబైన గౌరసంద్రం మారెమ్మ దేవత ఆలయ ముఖమండపం



సింహ వాహనంపై గౌరసంద్ర మారెమ్మ దేవత ఉత్సవ విగ్రహం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహ ముఖ మండపం ఆవిష్కరణతో పాటుగా శిఖర కలశ ప్రతిష్ట పూజలను నిర్వహించనున్నారు. నవగ్రహ దుర్గా హోమాలు, అంగన్యాస, జీవ కళాన్యాస హోమాలు పూర్ణాహుతి కార్యక్రమాలు చేపడతారు. ధ్వజారోహణం, అభిషేకాలు. బడి బియ్యం పూజ, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు సింహ వాహన ఊరేగింపు, అన్న ప్రసాద సేవ, భజన కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

'టీడీపీ పనైపోయింది'

కూడేరు: అవినీతి, అక్రమాలతో పాలన సాగించి అడ్డంగా ఆధారాలతో సీఐడీకి దొరికిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లడంతో టీడీపీ పనైపోయిందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రనాయుడు అన్నారు. ఆదివారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. ప్రాణం పోయే స్థితిలో ఉన్న టీడీపీకి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పొత్తు అనే సెలైన్ ఎక్కించినా ప్రయోజనం లేదని ఎద్దేవా చేశారు. అక్రమాల కేసులో చంద్రబాబు అరెస్టయితే పవన్ మద్దతుగా నిలవడం సిగ్గుచేటన్నారు. ప్రజాదరణ లేని పవన్ తీరును చూస్తుంటే చంద్రబాబు అక్రమాల్లో వాటా ఉందేమోనన్న అనుమానాలు రేకుత్తుతున్నాయన్నారు. బాబు, పవన్ ఏకమైనా ప్రజా మద్దతు ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించలేవన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గాలి జోరుకు టీడీపీ, జనసేన పార్టీలు పూర్తిగా కనుమరుగైపోతాయని ఆయన జోస్యం చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయదుర్గం రూరల్: అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు అర్బన్ సీఐ లక్ష్మణ్ణ ఆదివారం తెలిపారు. పట్టణంలోని కోట ఏరియా మారెమ్మ ఆలయ సమీపంలో నివసిస్తున్న పూజారి రామాంజనేయులు (57) ఈ నెల 14న ఇంటి వద్ద మెట్లు ఎక్కుతూ జారిపడి గాయపడగా, కుటుంబసభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ కేసు నమోదు చేసుకున్నారు. అలాగే మధు థియేటర్ యజమాని దేవరకొండ ప్రసాద్ సోదరుడు దేవరకొండ వెంకటేశులు (50) కొంతకాలంగా మద్యానికి బానిసై, అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో మనస్థాపం చెంది 12వ తేదీ థియేటర్ వద్ద క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబసభ్యులు బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం ఆస్పత్రిలో మృతి చెందాడు. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ మురళీ మోహన్ కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పామిడి: మండలంలోని దిబ్బసానిపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..ఎద్దులపల్లి గ్రామానికి చెందిన శంకర్ వజ్రకరూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఎద్దులపల్లి అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్



ఆర్ కొత్తపల్లి వద్ద రోవర్‌తో సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గం: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద మీ భూమి – మా హామీ పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా ప్రవేశపెట్టిన రీ సర్వే ప్రక్రియ డివిజన్ వ్యాప్తంగా శరవేగంగా సాగుతోంది. డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 34 గ్రామాల్లో ఇప్పటికే 1,28,538.48 ఎకరాల్లో తొలిదశలో రీ సర్వే పూర్తిచేసి, ఆ గ్రామాల్లో డిజిటల్ రికార్డులను అందుబాటులోకి తెచ్చింది. దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ ఒక్క గ్రామంలో కూడా భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టలేదు. బ్రిటిష్ కాలం నాటి భూ రికార్డులే ఇప్పటి వరకు చలామణి లో ఉన్నాయి. వాటి ఆధారంగానే కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ కారణంగా భూతగాలు పెరిగి రైతుల్లో ఎన్నో మనస్పర్థాలు చోటుచేసుకుంటున్నాయి. కానీ మొట్ట మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రీ సర్వే చేసి కొత్త రికార్డులను డిజిటల్ రూపంలో అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. డ్రోన్, కార్స్, రోవర్ వంటి అధునాత పరికరాలను సర్వే కోసం అధికారులు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం రెండో ప్రక్రియలో 15 మండలాల్లోని 40 గ్రామాల్లో 1,88,155 ఎకరాల్లో రోవర్ ద్వారా సర్వే మొదలైంది.

తొలి దశలో సర్వే పూర్తయిన గ్రామాలు

కళ్యాణదుర్గం డివిజన్‌లోని 15 మండలాల్లో బైద్రహళ్లి, ఎస్ మల్లాపురం, ఎన్ హనుమాపురం, సొల్లాపురం, గూల్యం, మ దెనహళ్లి, ఉంతకల్లు, లక్ష్మీపురం, లింగమనహళ్లి, గరుడచేడు, హెచ్ సిద్దాపురం, తుంబిగనూరు, మలపనగుడి, హెచ్ హొసళ్లి, జాజరకల్లు, హిర్దేహాళ్, ఉద్దేహాళ్, ఎర్రగుంట, బండూరు, కొలగానహళ్లి, కమతనహళ్లి, అడవిగొల్లపల్లి, సాములాపురం, కొంతానపల్లి, గణిగేర, బిదురుకొంతెం, శెట్టూరు, డి హీరేహాళ్, ఓబుళాపురం, మెచ్చిరి, చదం, ఆవులదట్ల, 74 ఉడేగోళం, తీటకల్లులో తొలిదశ రీ సర్వే పూర్తయింది.

రెండో దశలో రోవర్ సర్వే ప్రారంభించిన గ్రామాలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని రెండో దశ రోవర్ రీ సర్వే పనులు యుద్ద ప్రాతిపదికన మొదలయ్యాయి. సింగానహళ్లి, శ్రీధరఘట్ట, పులకుంట, గలగల, బెణికల్లు, మాల్యం, గంగవరం, కొనామ్‌పల్లి, శ్రీ రంగాపురం, నాగలాపురం, మురడి, హులికల్లు, చెన్నంపల్లి, రామాపురం, నిజవళ్లి, బెస్తరపల్లి, జంబుగుంబుల, గ్రామదట్ల, డి కొండాపురం, బీఎస్ హళ్లి, పాలవాయి, హుల్లికల్లు, పిల్లలపల్లి, ఎరడికేర, బొచ్చుపల్లి, చింతరపల్లి, లక్ష్మంపల్లి 50 గ్రామాల్లో రోవర్ సర్వే ప్రారంభమైంది.

రీ సర్వే ద్వారా ప్రయోజనం

జగనన్న భూ హక్కు ద్వారా నాకున్న ఐదెరకాల పొలం రీ సర్వే చేట్టారు. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్న పొలానికి శాశ్వత పరిష్కారం లభించింది. పైసా ఖర్చులేకుండా డిజిటల్ రికార్డులు అందించారు. హద్దులు ఏర్పాటు చేసి హక్కులు కల్పించారు సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– చిగిరి రామాంజనేయులు, హెచ్ సిద్దాపురం, డి హీరేహాళ్ మండలం

పారదర్శకంగా సర్వే

కళ్యాణదుర్గం డివిజన్ వాప్తంగా రెండో దశలో ఎంపిక చేసిన 50 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ శరవేగంగా చేపట్టాం. ఇది వరకే పూర్తిచేసిన 34 గ్రామాల్లోనూ అత్యంత ప్రామాణికంగా, పారదర్శకంగా రీ సర్వే పూర్తిచేసి రైతులకు డిజిటల్ రికార్డులు అందించాం. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజన చేకూరుతుంది.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం